# శర్వాణి

"దవానం - చామంతీపూలూ"

గ్రాండు ట్రంక్ ఎక్స్‌ప్రెస్ రైలయిమని వచ్చి, ఒంగోలు స్టేషనులో ఆగింది.

చిత్రమైన రైల్వే యాసతో చెవులు గింగురుమనేలా ఒకడందుకున్నాడు.

ఒక మూల హోల్డాలు నానుకొని ఒక యువకుడు భగవద్గీత చదువుకుంటున్నాడు.

"ధ్యాయతో విషయాన్ పుంసః
సంగస్తేషూపజాయతే
సంగా త్సంజాయతే..."

"దవనాం - చామంతి పూలు"

పూలవాడు దగ్గరగా బిగ్గరగా అరుస్తున్నాడు.

జనార్దనశర్మకు వాడి గొంతు పిసికి ఆ కేక ఆపు చెయ్యాలనిపించింది.

కాని -

వాడి పూలజంగిడిలోని చల్లని దవనం వాసన విరక్తికి అంకితం చేయబడ్డ శర్మ హృదయాన్ని గూడ మెత్తబరుస్తోంది. శర్మ ఎందుకో కొంచెం నవ్వి, గీత తరువాతి భాగం అందుకున్నాడు. ప్రాణాలు తోడే రైలు ప్రయాణంతో వెన్నెముక లాగుతోంది. కాస్త 'టీ', స్టేషనులో పుచ్చుకువస్తే బాగుండును -

నవ్వాడు - ఈమాత్రం నిగ్రహం లేనివాడు ఏం సాధించగలడు! అతని పచ్చని లేత ముఖంలో గంభీరమైన నిష్ఠ ఏదో పచారు చేస్తోంది.

ఏకాగ్రంగా గీత చదువుకుంటున్నాడు.

"ఏయ్ చామంతిపూలు! - అట్లా ఆ కిటికీ దగ్గరకు రా - పరిమళించే చిన్న పువ్వులు లేవూ"

ఎవరైనా దగ్గరగా తెచ్చి వీణ వాయిస్తున్నారా? "అరదముదేహ, మింద్రియము లశ్వ ములు –" వినగల పక్వ హృదయుడికి దేనిలోనుంచి ఐనా ఎంత మధురగానం వినపడు తుంది! –

"అబ్బాయీ, మరువంలేదూ?"

– పిలుపు కిటికీ దగ్గరకు వచ్చింది.

చుట్టూ వున్న గాలి గులాబీ వాసనతో నిండిపోయింది.

భగవద్గీతలోని ఒకొక్క శ్లోకం ఒకొక్క గులాబీ చెట్టు. అక్షరాలన్నీ చరచర పువ్వుల్లా వికసిస్తున్నాయి. గులాబీ ఆకులన్నీ మరువం వాసనతో గుప్పుమంటున్నాయి!

నికరమైన పరమ పవిత్ర ప్రాచీన సంస్కృత వాక్యాల్లో – ఈ మధుర కంఠాలు – మరువం, గులాబీల పరిమళాలు కనపడగూడదని ఏ ఉపనిషత్తూ, గుర్వాశీర్వచనం శాసించలేదా?

దవనం జడలకూ, సిల్కు జాకెట్లకూ, వీణాకంఠాలకూ, రంగురంగుల చీరలకూ, కొత్తగాజుల గలగలలకూ ఉలికిపడకపోవడం ఏ పదేళ్లనుంచో నిశితంగా అభ్యసించిన ఈ తపస్వి పాలిటికి ఏ దుర్మార్గపు ఇంద్రుడైనా వూర్వశిని పంపాడా?

పిలుపు జడలో గులాబిపూలు – శర్మ హృదయంలో వింత వింత జ్ఞాపకాలుగా పొడిచాయి.

అప్రయత్నంగా భగవద్గీత ముడిచి తల ఎత్తి చూచాడు.

గోపీచందనం రంగు సిల్కుచీర, ఆకుపచ్చని బ్లౌజు, లేత కలువపూరంగు శరీరం –

గుప్పెడు దవనం, మరువం, చామంతిపూలు కొని జడనిండా పెట్టుకొని కళాజీవి సుఖమయ స్వప్నంలా వెళ్లిపోతున్నది.

జనార్దనశర్మ తన కళ్ళను నమ్మలేక కళ్ళు చిట్లించి మళ్లా చూశాడు. నీళ్లు కమ్మే కళ్లను తుడుచుకొని తేరి చూచాడు.

"ఏ దేవతలు అనుగ్రహించి ఇచ్చిన వరదానమిది? ఏ కఠోర తపస్సుకు ప్రత్యక్ష ఫలం? నా మరపుల్లో – కన్నీళ్ళలో – నిరాశలో – విసువులో – విరక్తిలో తుడిచిపారవేసిన దేవతామూర్తి – శర్వాణికి ఎవరు ప్రాణమిచ్చి, నా యెదుట కదుపుతున్నారు?"

నా ప్రాణ కుసుమాలన్నిటితోనూ పూజించిన మెడవంపు కాదూ అది – నా జీవన మాధుర్యమంతా ఖర్చుపెట్టి నవ్వించిన పెదవులు కావూ అవి! ఆ నిగనిగల ఇంద్రనీలపు వలయాల వాలుజడ దర్శనంకోసం ఎన్నాళ్ళు మేల్కొని తపించాను!

కాంతులు పుక్కిలించే ఆ సన్నని నున్నని వేళ్ళను అర్పించడంకోసం ఎన్ని చక్కని పదాలు ఏర్చి పద్యాలు కూర్చాను!

రైలు కంయిమని కూసి కదలబోతున్నది.

"వాణీ - ఇదిగో - ఫ్లాస్క్ - అందుకో"

బాకా వంటి గొంతు ఒకటి ఆమెను పలకరించింది. శర్వాణి కిటికీలోంచి 'టీ' అందుకొని ఒక గ్లాసులో పోసింది. ఒక నల్లదొర సూటుతో వచ్చి ఆమె ప్రక్కను కూర్చున్నాడు. నోట్లో రూళ్లకర్ర వంటి హవానా చుట్ట. మధ్యమధ్య తీసి ఇంగ్లీషు మాట్లాడుతున్నాడు. (చంటిపిల్లలతో గూడా)-

అప్సరస పక్కను ఈ దైతేయుణ్ణి చూచి, పరిగెత్తే రైలు కిందకు దూకితే మంచిది కాదా అనుకున్నాడు శర్మ. ఆ వికారంతో శర్మ మనస్సు తునియలై, నిశ్చింతగా ఆ మగనితో గడిపే శర్వాణిని ఊహించుకొని స్త్రీజాతిని - లావణ్యాన్ని - ద్వేషించడం మొదలు పెట్టింది.

శర్వాణి గ్లాసులో పోసిన 'టీ' పెదవుల దగ్గిర పెట్టుకోడానికి తలయెత్తి, జనార్దన శర్మను చూచింది. గ్లాసు కింద పెట్టి రెప్పవాల్చకుండా శర్మను చూస్తోంది.

ఏ తియ్యని జ్ఞాపకాలో ఆమె మనస్సును పొడిచి బాధిస్తున్నట్టు ఆమె చూపుల్లో అశాంతి చెబుతూన్నది. రెండు నిముషాలు వూపిరాగేలా శర్మను సూటిగా చూసి నవ్వింది.

దేనినో ఆలోచిస్తూ తల వంచుకొన్న శర్మ తలయెత్తి శర్వాణి వంక చూచాడు. ఆమె ఇటుప్రక్క చూడలేదు. ఖులాసాగా మగనితో ఏదో మాటలాడుతోంది.

ఆ కళ్లలో ఎంత కొంటెతనం - ఆ పెదవుల్లో ఎంత బింకం - ఆ గుండెలో ఎంత స్నేహం వున్నదో అతనికి తెలుసు.

తన హృదయవేదనతో గుడ్లు పగిలేలా ఒక్కసారి వాణివంక చూచి 'నారీ స్తనభరనాభీ దేశం దృష్ట్వామాగా మోహావేశమ్' అన్న ఆచార్య వచనావృత్తిలో సామాను సర్దుకున్నాడు.

తరువాతి స్టేషనులో బండి ఆగింది. దిగి మరిఒక పెట్టెలోకి ఎక్కాడు.

## 2

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ హోరుపెడుతూ పరుగెత్తుతూన్నది.

జనార్దనశర్మ హృదయం అంతకన్న మహావేగంగా - కాలాన్నీ, దేశాన్నీ కబళించి పరిగెత్తుతోంది.

అతడు ఒకచోట సర్దుకుని, కిటికీలో తలపెట్టి శూన్యంగా బైటికి చూచాడు. ఎగిరే

ధూళీ, రాక్షసి బొగ్గురవ్వలూ తప్ప ఏమీ కనపడడం లేదు. చుట్టూ మనుష్యులున్నారు, మాటాడుకుంటున్నారు. ఏమీ వినపడడం లేదు. తలనెప్పిగా వున్నది. మామూలు 'టీ' తాగకపోవడంచేత గాబోలు! కాని అంతట్లోకే శరీరంలో అంత వికృతి పుట్టనవసరం లేదు - తల చించుకొన్నా తోచడంలేదు. మనస్సులోని ఆ వేగం ఇంకా చల్లారలేదు. మస్తిష్క ప్రపంచమంతటా ఇసక తుఫానులా శర్వాణి సౌందర్యం రేగిరేగి ఆక్రమించింది.

పెదవి దగ్గర మధుపాత్ర జారవిడుచుకొన్న వాడివలె, కళ్లలోని సువర్ణసుందర స్వప్నాన్ని తుత్తునియలు చేసుకొన్నవాడివలె జనార్దనశర్మ శూన్య హృదయంతో ఎదుట కిటికీలోంచి సుదూరంలో కనపడే భూమ్యాకాశాలు కలిసేచోటు చూస్తున్నాడు.

ఒక మహా ప్రేమికుడు తన ప్రియురాలి దగ్గరగా వెళ్లి పెదవుల మీద గాఢంగా ముద్దుపెట్టుకుంటూన్నట్టు తోచి ఈర్ష్యగా - వ్యథగా తల తిప్పుకొన్నాడు.

ఈ ఆడపిల్లలు - శరీర లావణ్యాలు - ప్రేమదాహం - ఎన్నాళ్లు నన్నిట్లా వేటాడుతాయో! పదేళ్ల కిందట పుస్తకాలూ, చదువూ, స్కూలూ తప్ప రెండవ దిక్కు చూడని నా జీవితంలోకి తొలిసారి అమాయకపు నీలికళ్లతో, పట్టుపరికిణీతో పక్కింటివారి గారాబు బిడ్డ శర్వాణి ప్రవేశించింది. క్రమంగా మెరుపెక్కి మధురంగా, బరువుగా వాలే ఆ చూపులూ, గోరింటపూల నున్నని లేత ఎరుపుతో నిగనిగలాడే ఆ కొంటెనవ్వు పెదవులూ నన్ను శిక్షించి ఏవో తియ్యని ఊహల్లో తిప్పడం మొదలుపెట్టాయి గదూ! కలసి చదువులు - కమ్మని కథలు - పెరళ్లు -నవ్వులు - పువ్వులు - అచ్చంగా మల్లెపూవులు - వెన్నెల గోష్ఠులు - కోపాలు - శపథాలు - అనుగ్రహాలు - హాస్యాలు - పిచ్చి, పిచ్చి, అంతా వట్టి భ్రమ. ఏదీ శాశ్వతం కాదు. ఏ మాధుర్యం, ఏ పరిమళం, ఏ కాంతి కళిక స్థిరంగా నిలిచింది!

ఒకనాటి ఉదయము కొత్తచీరలో తొణికే యౌవన శోభతో, శర్వాణి తల ఒంచుకుని తిరిగి చూడకుండా వెళ్లిపోయింది - ఎక్కడికో -

వసంత శోభ, శరత్కాల కౌముది - ఎప్పటికైనా తిరిగి ఒస్తాయి. శర్వాణి మాత్రం మళ్లా కనపడలేదు.

నిశ్చింతగా నా జీవితం గడిచిపోతోంది - అనుకున్నాను -

కాని - శాంతికి నోచుకోలేదు మనస్సు. కళాశీలి హృదయానికి అశాంతి వరప్రసాదమేమో!

కొంతకాలానికి నా జీవిత యాత్రలో భవాని ఎదురుపడడి తన చమత్కార వాక్కులతో- జానకి దీనాతి దీనములైన ఆకలి చూపులతో - శారద ఒకొక్క భంగిమతో నన్నెంత

ఏడిపించారు?

నాటికి నేడు మళ్లా శర్వాణి మానసిక పరిధుల్లో తుఫాను లేవదీసింది.

నిశ్చింతగా - ఏదీ శాశ్వతం గాదు.

స్త్రీ లావణ్యాలకంటె - సీతాకోకచిలకల కంటె, వర్షాకాలపు ఇంద్రధనుస్సుందర దృశ్యాలకంటె, ప్రభాత ప్రశాంత నదీగర్భం మీదనుంచి లేచి చెంగున నృత్యానికి దుమికే ఉషస్సౌందర్యం కంటె, చిన్నపిల్లల నున్నని బుగ్గలకంటె, వీణా సంగీతం కంటె అతీతమైన సౌందర్యం ఎక్కడుందో వెదికి పట్టుకోవాలి.

స్వర్గీయ పారిజాత ప్రసూనమాలవలె ఎప్పటికీ వాడనిదీ - వీడనిదీ -

ఎవడీపరీక్ష నన్ను?

"ఇక ఏ సౌందర్యలవంకోసమూ తపించను - ఏ వీణాగళానికీ కలవరపడకూడదు- ఏ మెరుగు చెంపలనూ కన్నెత్తి చూడను - పరమ ప్రాప్యం దేనినో సాధించాలి" అని ఒక నిశ్చయానికి జీవితాన్ని తిప్పబోయేసరికి ఎవడో ఇంద్రజాలపింఛిక విసరడం, ఒక అప్సరస ఇట్టే పుట్టి నన్ను వేటచెయ్యడం - ఏమిటిది?

బెజవాడ స్టేషనులో గట్టిగా కూసి ఎక్స్‌ప్రెస్ ఆగింది.

చెయ్యవలసిన ప్రయాణం చాలా ఉన్నది. శరీరం చాలా అలసి వున్నది. ఇక్కడ ఒక రోజు విశ్రమించి వెళ్లడం మంచిదని నిశ్చయించాడు.

దిగి జట్కాలో ఒక హోటలుకు వెళ్లి మేడమీద ఒక గదిలో బస ఏర్పరచుకున్నాడు.

మేడ విశాలంగా, అందంగా వుంది. చాలా గదులున్నాయి. భాగ్యవంతులు బస చేయదగిన హోటలు. డాబా ఎక్కి చూస్తే నల్లగా పాయలుపాయలుగా ప్రియురాలి వేణీ భరంలా కృష్ణానది కనిపిస్తున్నది.

రాత్రి సుమారు 10 గంటలవుతుంది. కృష్ణానది మీద నుంచి హాయిగా గాలి వస్తూంది. లైటు వేసి తన గదిలో పడక కుర్చీమీద కూర్చుని నీలకంఠ దీక్షితుని వైరాగ్య శతకం చదువుతున్నాడు శర్మ.

"తృణవద్భ్రమంతి చపలాః
స్త్రీనామని చండమారుతే చలితే..."

కళ్లు నొప్పులు పెడుతున్నాయి. ఆవలింతలు -

"ధరణీధరా ఇవ సంత
స్త్వత్ర నకించి త్ప్రకంపంతే"

పకపక నవ్వుతూ "మహానుభావుడు అద్భుతంగా చెప్పాడు" - జనార్దనశర్మ ఈ మాట గట్టిగా పైకే అని మరిఒకటి చదువుతున్నాడు.

పకపక ఎదురుగుండా నవ్వు. తలుపు సన్నంగా తోసుకు వచ్చి -

తల ఎత్తి చూచాడు, 'శర్వాణి!'

లేత మబ్బురంగు ఉప్పాడ చీర - పొట్టి చేతుల జాకెట్ - జడనిండా మల్లెపూలు! ఘుమఘుమ పరిమళించే తాంబూలం నమలుతూ దగ్గరికి ఒస్తోంది.

శర్మ ఖంగారుగా లేచి నించుని - "వాణీ... ను...వ్వె...ట్లా... కృష్ణ చల్లని గాలిలోంచి పూల సువాసనలా కొట్టుకొచ్చావా? .. నేను కలగనడం లేదుగదా?... డాబా పగల గొట్టుకుని పైనుంచి దూకావా?"

"పాతాళ లోకంలోనుంచి .. పగపట్టిన నాగ కన్యకలా బుస్సుమంటూ వచ్చాను"

వెక్కిరింతగా కనుబొమ్మలు దగ్గరగా లాగి, కళ్ల పైభాగం మీద నుంచి నవ్వింది.

"ఈ వెళ్లడం వెళ్లడం హిమాలయాల్లోకేనా, లేక ఇంటికి వెడతావా?"

శర్వాణి హత్య చెయ్యడం ప్రారంభించింది.

"తెల్లబోతావేం? నీ అంత సంస్కృతం నాకు రాకపోయినా తాత్పర్యం నాకు తెలుస్తుంది... ఎన్నాళ్లనుంచి ఈ వేదాంతం జనూ!"

ఈ పిలుపు జనార్దనశర్మ గుండెల్లో చెయిపెట్టి కలచింది. ఈ పిలుపు మళ్లా పదేళ్లకు - అబ్బ! మానవ జీవితం ఎంత స్నేహదుర్బలం!

ఆమె చరచర వచ్చి, చేతిలో పుస్తకం లాక్కొని దూరంగా విసరి, విసనకర్రలా విప్పారిన పుస్తకం పేజీలు చూసి పగలబడి నవ్వుతూ అతడు లేచిన పడక కుర్చీలో కుప్పగా కూర్చుంది. తాంబూలపు పచ్చకర్పూరపు పరిమళం, తలమీది తెల్ల గులాబీనూనె సువాసనా, మల్లెపూల సుగంధ ప్రళయం అతని నోరు నొక్కి ఊపిరాడనివ్వలేదు.

చాలా వైరాగ్యాలింతేగాబోలు! ఆడపిల్ల ఒక్క కర్పూరహాసం చాలు కోటి గంభీర ముద్రల్ని తలకిందులు చెయ్యడానికి!

"ఎన్నాళ్లకు చూచాను వాణీ... నిన్ను. ఇంకా జ్ఞాపకం ఉన్నానా!"

అతని మౌనప్రణయవాసనావ్యథ ముఖంలో విరక్తిలో రక్తిలా కనబడుతోంది.

"నేను మగవాణ్ణి కాదుగా... చూచీచూడనట్టు నటించడానికి - గుటకలు మింగడానికి - లేని మర్యాదలు పోవడానికి - అసూయతో కుళ్లిపోడానికి! నేను చూడలేదనుకున్నావా?

నీ ముఖంలో వెలిగే జ్ఞాపకాల బాధను - స్నేహవాసనాపేశల వ్యధను?

అంత పిరికితనమేం నీకు? నవ్వుతూ కులాసాగా మాటలాడితేఎంత సంతోషించి ఉందును? ఆయనకు చక్కగా పరిచయం చేసి 'టీ'తో, నవ్వులతో, పదేండ్లనాటి కమ్మని జ్ఞాపకాలతో ఎంత హాయిగా గడిపివుందుము!

అందుకే ఒకప్పుడు నాకు మగమృగాలు లేని స్వచ్ఛ వాతావరణం ఏదైనా వున్నదేమో వెతకాలనిపిస్తుంది.

నాకు తెలుసు - గాఢంగా ప్రేమించిన యువతి ఐనా సరే నువ్వు ధైర్యంగా మాటాడ లేవు. నువ్వేకాదు, ఏ మగవాడూ మాటాడడు. దొంగచూపులు చూస్తాడుగాని! నాకు ధైర్యం వుంది. నాకు ఆప్తుడైన యువకుడితో నేను నిర్మలంగా మాటాడగలను. అప్పుడు హృదయం ఎంత తేలిక అవుతుంది! బుద్ధి ఎంత సూటిగా ఉంటుంది! ఈ స్వచ్ఛత మీ జాతికి కోసినా లేదు.

నేను నీవంటి చిరకాల మిత్రుడు కనపడినప్పుడు మనసారా మాటాడకుండా వుండ లేను. ఇక ఒక్క నిముషం నువ్వక్కడ వుంటే నేనే హాయిగా నీ దగ్గరకు వచ్చి మాటాడేదాన్ని. భరించలేక వెళ్ళిపోయావు గదూ, పిచ్చివాడా! తర్వాత ఎంత బాధపడివుంటావో నాకు తెలియదా?

స్టేషనులో దిగి నువ్వు జట్కా యెక్కి వెళ్లడం చూస్తూనే వున్నాను. మేమూ నీ వెనకా లనే వచ్చి - ఆయన ఇంకో హోటలు బాగుంటుందంటే నేనిక్కడ ఆపాను"

పట్టుపడ్డ దొంగలా - జనార్దనశర్మ ఏమీ మాటాడకుండా కోపంతో చలించే ఆమె కళ్లకేసి చూస్తూ, ఆ సీరియస్‌నెస్ భరించలేక ప్రసంగం మార్చదలిచినాడు.

ఏమంటే ఏం చంపుతుందో! "ఇట్లా కోప్పడి తప్పు మార్గాలనుంచి తప్పించే లావణ్య నిధి లేక పదేళ్లనుంచి చెడిపోయాను" - పౌరుషం చచ్చినా చావని చమత్కార ధోరణితో అన్నాడు.

"వివేక చూడామణిని, రాజయోగ సారాన్ని, ఎడ్ల రామదాసు కీర్తనల్నీ ఆశ్రయించు. ముక్తిమార్గం దొరుకుతుంది" - ఫక్కున నవ్వింది.

"జీవితమంతా ధారపోసి ప్రేమించిన అప్సరసలను ఏ వన్యమృగాలో ఎత్తుకుపోతే అభాగ్యులకింక గతి ఏమిటి?" - శర్మ, అని భయపడ్డాడు, ఆమె మనస్సు గాయపడ్డం గురించి.

శర్వాణి శాంతంగా అందుకుంది:

"మగవాళ్లకు ఎంత ఈర్ష్య ఉన్నదయ్యా శర్మా! స్త్రీ ఎందరినైనా ప్రేమించి అందరి

తోనూ సుఖంగా, నిశ్చలంగా గడపగలదు, ఓరిమిగా. ప్రియులు – స్నేహితులు – అన్నలు – బావలు – మరుదులు! మగవాడు మాత్రం ఒక్క స్త్రీ ఒకసారి నవ్వుతూ పొరపాటుననో, మనస్ఫూర్తిగానో తనతో మాటాడితే ఇంక ఆవిడచుట్టూ కంచెలు కట్టి ఎవ్వరినీ దగ్గరకు రానివ్వడు. ఆమె నవ్వులు – ఏడ్పులు – విశ్వాసాలు అన్నీ తనకు అంకితం చెయ్యమంటాడు. కాదంటే గోల".

"వాణీ, నీవంటి అప్సరస అట్లాంటి వెలుగుబంట్ల దగ్గరగా కూచుంటే చూచి సహించలేను"– శర్మ యీసారి మనస్సుతో అన్నాడు.

శర్వాణి గాయపడలేదు. సరిగదా నవ్వుతూ తిరస్కారంగా – "అట్టి వన్యమృగ రక్షణలో లేకపోతే మమ్మల్ని ఈపాటికి ఎన్ని క్షుద్రమృగాలు సమీపించేవో ఊహించావా?"

శర్మకు అంకుశం పోటులా తగిలింది. వాణి వెంటనే అందుకున్నది: "శర్మా... నిన్ను అవమానిస్తున్నాననుకోకు. నిజం అంతే. ఒక స్త్రీకి ఒక పురుషుడు. ఇది ఒక పెద్దలాటరీ. నాకు ఏ గంధర్వుడో భర్త కాలేదన్న విచారం లేదు. జీవితం అంటేనే రంగుల కలలా కనపడుతుంది. అందులో జరిగినదాన్ని దేన్నీ నిజంగా తీసుకోం. ఇందులోనూ అంతే. ఈ దాంపత్యాలు – స్నేహాలు – విరహాలు – ఈర్ష్యలు– దేన్నీ శాశ్వతంగా తీసుకోనక్కర లేదేమో! ఎందరు భార్యలు భర్తలను ప్రేమిస్తున్నారు? ఎందరు ప్రియులు ప్రియురాళ్లకు అంతరాత్మలను ధారపోస్తున్నారు! ఎందరు మిత్రులు మిత్రులకు హృదయాలు విప్పుతున్నారు? ఈ విశ్వమే, నమ్మేలా కనబడే అసత్య సుందర ఇంద్రజాలం. ఇందులో సత్యాసత్యాల, శాశ్వతాశాశ్వతాల విచారణా? – నవ్వు రాదూ? తత్త్వం ఆలోచిస్తే – ఎందుకో, ఎవరో ఇక్కడ విసరివేశారు మన్ని. బ్రతికి వున్నన్నినాళ్లూ నవ్వుతూ, గంతులేస్తూ ఉత్సాహంగా ఈ క్రీడారంగంలో గడిపి లేచిపోడానికి బదులుగ్గా, ఈ ఈర్ష్యలు – ద్వేషాలు – కుటిల చింతలు – మనస్సుల మీద పుళ్ళు – ఎందుకో నాకర్థంకాదు"

ఆమె ముఖం స్వచ్ఛంగా, శరదాకాశంలా వుంది. ఏమి ఫిలాసఫీ!

జనార్దనం నోరు మూసుకున్నాడు.

కింద ఏవో మాటలు వినబడుతున్నాయి. శర్మ ఉలికిపడి –

"వాణీ... నీ భర్త ఎక్కడ?"

శర్వాణి వచ్చే నవ్వును లోపలికి గెంటుతూ – "ఏం.. ఆయన వచ్చి నన్ను నీ గదిలో చూస్తే .. పాపం నీ మర్యాదా పోతుందని భయపడుతున్నావా?... లేక ఈర్ష్యతో గొంతు పిసుకుతారనా? వెర్రివాడా! బెంగపడకు. ఆయన రెండవ ఆటకు ఏదో ఇంగ్లీషు సినిమాకు వెళ్లారు. నన్ను కూడా రమ్మంటే నేను రానన్నాను. నీ యిష్టం అని వెళ్లిపోయారు.

నీకంటె ఆయనకు అనేకవిధాల ఆనందతన్మయంగా వుండడం తెలుసు. నికరమైన ఉమర్ ఖయ్యాం శిష్యులు. మానవ జీవితమంటే ప్రేమతోనూ, బాధలతోనూ నవ్విన ఒక పెద్ద నవ్వు అని ఆయన మతం. కనుకనే నాకూ ఆయనకూ సరిపోయింది... పడుకో - నేనింక వెళ్లిపోతున్నాను. నీ కళ్ళు నిద్రతో తూలుతున్నాయి. నిన్న చూచినప్పటినుంచి నీతో మాటాడలేదని, ఏదో వాక్కుకతీతమైన శక్తి ఇచ్చిన ఇలాంటి సంఘటనల్లో తప్ప నిన్నువంటివారిని చూడడం పడదని నిన్ను వెతుక్కుంటూ వచ్చాను. ఇంక వెడుతున్నాను. సుఖంగా నిద్రపో" అని లేచి వెళ్లిపోతోంది.

గోడవతల పకపక నవ్వు! అద్దాల తలుపులలోంచి గూడా కహకహ నవ్వు! ఆశ్చర్య గంభీరమైన జనార్దనశర్మ ముఖంలో ఒక చేదు చిరునవ్వు!

**(1943 డిసెంబరు - భారతి)**